మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 87 ఆదివారం 07 - 09 - 2025 పేజీలు: 8 వెల: 4

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పల్లెకు పోదాం



3లో..

## ఎర్రకోటలో భారీ చోరీ..



- వజ్రాల కలశం అపహరణ

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో భారీ చోరీ జరిగింది. అత్యంత పటిష్ఠమైన భద్రత ఉండే చారిత్రక ఎర్రకోట ప్రాంగణంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జైన మతపరమైన ఆచారంలో భాగంగా ప్రదర్శనకు ఉంచిన దాదాపు కోటి రూపాయల విలువైన వజ్రాలు పొదిగిన కలశాన్ని దొంగలు అపహరించుకుపోయారు ఎర్రకోటలో ప్రస్తుతం జైనుల 'దశలక్షణ మహాపర్వం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ 2 లో..

## కర్నూలులో మళ్లీ ఉల్లి లొల్లి..



- ఉల్లిగడ్డలను కొత్తబస్టాండ్ రోడ్లపై వేసి,రైతుల.. నిరసన
- గంటల కొద్ది ట్రాఫిక్..జాం
- రాక, పోకలకు తీవ్ర.. ఇబ్బందులు



(మన గళం,కర్నూలు మార్కెట్ యార్డ్) : కర్నలు నగరంలో మళ్లీ ఉల్లి లొల్లి ప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు ఉల్లి పంట పోటెత్తింది. జిల్లాలోని పలు పరిసర ప్రాంతాల నుంచి వందలాది వాహనాల్లో రైతులు తమ పొలాల్లో పండించిన ఉల్లి పంటను కోసి, మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. అయితే..తగిన గిట్టుబాటు ధర లేదంటూ గత 4 రోజుల కిందట రైతన్నలు నిరసనలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంతి నారా చంద్రబాబు నాయుడు క్వింటాల్ ఉల్లికి రూ.1200ల చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించారు. అయితే..మార్కెట్ యార్డులో కేవలం 2 రోజులు మాత్రమే క్వింటాల్ రూ.1200ల చొప్పున కొనుగోళ్లు జరిగాయని, మళ్లీ వ్యాపారులు తమ పంటను కేవలం రూ.200-400ల కే అడుగుతున్నారని రైతన్నలు వాపోయారు. అంతే కాకుండా, ఏకంగా శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొత్తబస్టాండు వద్ద రోడ్డుపై ఉల్లిగడ్డలను పారబోసి, రహదారిపై బైఠాయించి,ఆందోళనకు ఉపక్రమించారు. తమకు న్యాయం చేయాలని, తమ పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వారి ఆందోళనకు వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మద్దతు ప్రకటించారు. తాను సైతం రహదారిపై బైఠాయించి, రైతుల సమస్యలను ఆలకించారు. అంతే కాకుండా ఏ.పి.రైతు సంఘం నాయకులు రామక్రిష్ణ,తదితరులు సైతం అక్కడికి చేరుకుని, రైతులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావాన్ని ప్రకటించారు. ఇదే క్రమంలో ఇరువైపులా రాక,పోకలు స్థంభించిపో యాయి. భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో రాక,పోకలకు వీలు కాక వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## ఐరాస సమావేశాలకు ప్రధాని మోదీ దూరం

### యూఎస్ టారిఫ్స్ వేళ భారత్ కీలక నిర్ణయం..



మన గళం, న్యూఢిల్లీ : అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్య సమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 2 లో..



## ఏపీ లిక్కర్ స్కాంలో ముగ్గురికి బెయిల్

మన గళం, అమరావతి : ఏపీ లిక్కర్ స్కాంలో ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరైంది. ధనుంజయ్, కృష్ణ మోహన్, బాలాజీ గోవిందప్పకు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కొక్కరు 2 లక్షల రూపాయల చొప్పున రెండు పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. అలాగే ముగ్గురి పాస్‌పోర్టు సమర్పించా లని సూచించింది. ఇప్పటికే 2 లో..

## సెప్టెంబర్ 7న శ్రీవారి ఆలయం మూసివేత



మన గళం, తిరుమల : తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ముఖ్యమైన విషయాన్ని తెలియజేసింది. చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7న (రేపు) శ్రీవారి ఆలయ ద్వారాలను దాదాపు 12 గంటల పాటు మూసివేయనున్నట్లు ప్రకటించింది. ఈ కారణంగా, భక్తులకు దాదాపు 15 గంటల పాటు స్వామివారి దర్శన భాగ్యం ఉండదని స్పష్టం చేసింది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 7వ తేదీ 2 లో..

## కాలేజీల ప్రైవేటీకరణ పెద్ద స్కాం..



- మాజీ ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

మన గళం, అమరావతి : జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని, వాటి ప్రైవేటీకరణ వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉందని మాజీ ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేసేందుకే ఈ కుట్ర పన్నుతున్నారని 2 లో..

## అదుపుతప్పి లోయలోపడ్డ అంబులెన్స్.. ఇద్దరు మృతి



మన గళం డెస్క్ : అంబులెన్స్ అదుపుతప్పి లోయలోపడిన ఘటనలో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పంజాబ్ రాష్ట్రం హెూషియార్‌పూర్ జిల్లాలోని చింట్‌పుర్ని రోడ్డుపైగల మంగువాల్ బ్యారియర్ దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు హిమాచల్‌ప్రదేశ్ నుంచి వస్తున్న అంబులెన్స్ మంగువాల్ బారియర్ దగ్గర అదుపుతప్పి లోయలోపడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. గాయపడిన ఇద్దరిని బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



## సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.29.84 లక్షలు

మనగళం, కర్నూలు సిటీ : కుడా నిధులు రూ.29.84 లక్షలతో కర్నూలు నగరంలో 100 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో కర్నూలు నగరంలో 100 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు సంబంధించి కుడా నిధులు రూ.29.84 లక్షల చెక్ ను మంత్రి చేతుల మీదుగా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ప్రోత్సహిస్తూ 2 లో..

## ఎట్టకేలకు తాడిపత్రిలో అడుగుపెట్టిన కేతిరెడ్డి

- అన్ని అవాంతరాలు దాటుకుని సుప్రీంకోర్టు అనుమతి తీసుకుని మరీ..
- దాదాపు 15 నెలలుగా కేతిరెడ్డిని తాడిపత్రికి రాకుండా అడ్డుకున్న జేసీ



మన గళం, అమరావతి : వైసీపీ సీనియర్ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకున్నారు. అన్ని అవాంతరాలు దాటుకుని సుప్రీంకోర్టు అనుమతి తీసుకుని మరీ ఆయన తాడిపత్రిలోకి అడుగుపెట్టారు. టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ జేసీ ప్రభాకర్ రెడ్డితో కేతిరెడ్డి పెద్దారెడ్డికి చాలా రోజులుగా గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 15 నెలలుగా కేతిరెడ్డిని తాడిపత్రికి 2 లో..

## ముంబైను పేల్చేస్తామన్న వ్యక్తి 24 గంటల్లో అరెస్టు



మన గళం, ముంబై : మహానగరాన్ని మానవబాంబులతో పేల్చేస్తామంటూ వాట్సాప్ మెసేజ్‌లతో కలకలం సృష్టించిన వ్యక్తిని కేవలం 24 గంటల్లో పోలీసులు అరెస్టు చేశారు. అతనిని బిహార్‌కు చెందిన 51 ఏళ్ల అశ్విని కుమార్‌గా గుర్తించా రు. సిటీలో 34 'మానవబాంబులు' ప్రవేశించినట్టు ముంబై ట్రాఫిక్ పోలీసులను బెదిరించిన గంటల్లోనే నొయిడాలో అతన్ని అరెస్టు చేశారు. ముంబై పోలీసులు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ 2 లో..

# ఎర్రకోటలో భారీ చోరీ..



కార్యక్రమంలో 760 గ్రాముల బంగారం, వజ్రాలు, పచ్చలు పొదిగిన ఆభరణాల కలశాన్ని ఉపయోగించారు. అయితే, ఈ కార్యక్రమాలకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా హాజరయ్యారు. నిర్వాహకులు ఓం బిర్లాకు స్వాగతం పలకడంలో బిజీగా ఉన్న సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. అక్కడ వేదికపై ఉంచిన దాదాపు రూ.కోటి విలువైన కలశాన్ని అపహరించుకుపోయారు. కార్యక్రమం తిరిగి ప్రారంభమయ్యాక కలశం కనిపించకపోవడంతో నిర్వాహకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో ఒక అనుమానిత వ్యక్తి కదలికలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే అతడిని అరెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే రెడ్‌ఫోర్ట్ ప్రాంతంలో భారీ చోరీ వ్యవహారం రాజధానిలో కలకలం రేపుతోంది.

## ఐరాస సమావేశాలకు
# ప్రధాని మోదీ దూరం

నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ముంబైను పేల్చేస్తామన్న
# వ్యక్తి 24 గంటల్లో అరెస్టు



విషయం వెల్లడించారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ అరెస్టు చేసినట్టు చెప్పారు. నేరానికి ఉపయోగించిన ఫోన్, సిమ్ కార్డు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ముంబై ట్రాఫిక్ వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు శు క్రవారంనాడు బాంబు బెదిరింపు వచ్చిందని, దీంతో

వదంతులు నమ్మరాదని, ఎలాంటి సహాయం అవసరమైనా తమను నేరుగా సంప్రదించాలని ప్రజలను కోరినట్టు చెప్పారు. నిందితుడు అశ్వనీ కుమార్ వృత్తిరీత్యా జ్యోతిష్యుడు. పాట్నాలోని పాటలిపుత్రలో వాస్తు కన్సల్టెంట్‌గా ఉన్నాడు. గత ఐదేళ్లుగా నొయిడా సెక్టార్ 79లో తన తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. అతని తండ్రి సురేష్ కుమార్ పదవీవిరమణ చేసిన విద్యాశాఖ అధికారి. తల్లి ప్రభావతి హౌస్‌మేకర్. భార్య అర్చనను విడిచిపెట్టేశాడని, ఆర్థికపరమైన గొడవలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. 2023లో అశ్వనీకుమార్‌పై బిహార్‌కు చెందిన అతని ఫ్రెండ్ ఫిరోజ్ ఫుల్వారి పాట్నాలోని షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. దీంతో మూడు నెలల పాటు కుమార్ జైలులో ఉన్నాడు. ఫిరోజ్‌ను టెర్రర్ కేసులో ఇరికించే ఉద్దేశంతోనే కుమార్ తాజాగా బెదిరింపు మెసేజ్‌లు పంపినట్టు ఇన్వెస్టిగేటర్లు చెబుతున్నారు. అరెస్టు సమయంలో కుమార్ నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమరీ కార్డులు, రెండు డిజిటల్ కార్డులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు స్వాధీన చేసుకున్నారు.

# ఏపీ లిక్కర్ స్కాంలో ముగ్గురికి బెయిల్

ఏపీ లిక్కర్ స్కాం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి విజయవాడలోని ఏసీబీ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతినిస్తూ బెయిల్ ఇచ్చింది. ఇందుకోసం రూ.50వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల అనంతరం ఈ నెల 11వ తేదీన మళ్లీ రాజమండ్రి సెంట్రల్ జైలులో సరెండర్ అవ్వాలని సూచించింది. ఏపీ లిక్కర్ స్కాం కేసులో సీఎంవో మాజీ కార్యదర్శి కె. ధనంజయ రెడ్డి ఏ 31గా, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి ఏ32గా, బాలాజీ గోవిందప్ప ఏ33గా ఉన్నారు. వీరిలో మే 13వ తేదీన బాలలాజీ గోవిందప్ప అరెస్టయ్యాడు. మే 16న ధనుంజయ్, కృష్ణమోహన్ రెడ్డి అరెస్టు అయ్యారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఆ డబ్బులను వాళ్ల వద్దకే చేర్చామని గతంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య తెలిపారు. ఈ మేరకు వారి రిమాండ్ రిపోర్టులో కూడా దీన్ని సిట్ అధికారులు పేర్కొన్నారు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వారి పేర్లను స్కాం కేసులో చేర్చామని సిట్ అధికారులు మెమోలో తెలిపారు.

# సెప్టెంబర్ 7న తిరుమల శ్రీవారి ఆలయం మూసివేత



సాయంత్రం 3:30 గంటల నుంచి, మరుసటి రోజు అంటే సెప్టెంబర్ 8వ తేదీ తెల్లవారుజామున 3:00 గంటల వరకు ఆలయం మూసివేత కొనసాగుతుంది. హిందూ సంప్రదాయం ప్రకారం గ్రహణ సమయంలో ఆలయాలను మూసివేయడం ఆనవాయతీ. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఆలయం మూసివేత సందర్భంగా అన్ని రకాల ఆర్జిత సేవలను, వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. సిఫార్సు లేఖలపై జారీచేసే దర్శనాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మార్పుల దృష్ట్యా, తిరుమలకు యాత్ర పెట్టుకున్న భక్తులు తమ ప్రయాణ ప్రణాళికలను అందుకు అనుగుణంగా మార్చుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. వీలైతే, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ముందుగానే దర్శనం టికెట్లను బుక్ చేసుకోవడం మంచిదని సూచించింది. గ్రహణం ముగిసిన తర్వాత, సెప్టెంబర్ 8వ తేదీ ఉదయం నుంచి ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి, దర్శనాలను యథావిధిగా పునఃప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

# కాలేజీల ప్రైవేటీకరణ పెద్ద స్కాం..

ఆమె విమర్శించారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, అనుబంధ ఆసుపత్రి ఉండాలన్న గొప్ప లక్ష్యంతో జగన్ ఈ కాలేజీలను ప్రారంభించారని రజని గుర్తుచేశారు. పేదలకు ఉచితంగా వైద్యం, పరీక్షలు అందించాలనేది జగన్ ఆలోచన. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఆ కాలేజీలను అమ్మకానికి పెడితే పేద ప్రజల పరిస్థితి ఏమిటి? కోట్లు ఖర్చు పెట్టి చదివించే స్తోమత మధ్యతరగతి కుటుంబాలకు ఉంటుందా?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. కాలేజీల కోసం సేకరించిన భూములను కూడా ప్రైవేటుపరం చేయడం వెనుక భారీ స్కాం ఉందని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కాలేజీలను తిరిగి ప్రభుత్వపరం చేయడమే కాకుండా, ఈ కుంభకోణంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని రజని ఆరోపించారు. "లక్షలాది మందికి ప్రాణదానం చేసిన సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.4 వేల కోట్లకు పైగా బకాయిలు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు" అని ఆమె మండిపడ్డారు. ఈ పథకాన్ని ప్రైవేటు బీమా కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నంలోనూ మరో స్కాం ఉందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను 120 ఏళ్లు బతికిస్తానని చెప్పే చంద్రబాబు, ముందు తురకపాలెంలో జరుగుతున్న మరణాలను ఆపాలి అంటూ విడదల రజని ప్రభుత్వానికి హితవు పలికారు.



# సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.29.84 లక్షలు

ఉంటారని తెలిపారు. వారి ఆశయాల మేరకు జిల్లాలో కర్నూలు నగరంలో ఏ ఐ టెక్నాలజీ తో కూడిన 100 సీసీ టీవీ కెమెరాలను కూడా నిధులతో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదివరకే నగరంలో 150 సీసీ టీవీ లను మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ అధునాతన సీసీ టీవీ కెమెరాల ద్వారా నగరం లో నేరాల నియంత్రణకు వీలవుతుందన్నారు. సీసీ టీవీ కెమెరాలకు రూ.30 లక్షలు మంజూరు చేసిన కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు నగరం శాంతి భద్రతలతో ప్రశాంతంగా ఉండేందుకు, నేరాల నియంత్రణకు తోడ్పడాలన్న లక్ష్యంతో కుడా నిధులు మంజూరు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ రహదారి భద్రత లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కు వీలుగా నగరంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఇదివరకే మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 150 కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం కుడా నిధులతో మరో 100 అత్యాధునిక సాఫ్ట్వేర్ తో కూడిన కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నగరంలో 250 కెమెరాల తో నియంత్రణకు వీలుగా పకడ్బందీ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో సర్వేలెన్సు, శాంతిభద్రతలు మరింత మెరుగుపడేందుకు వీలుగా కుడా నిధులతో 100 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు.

# ఎట్టకేలకు తాడిపత్రిలో అడుగుపెట్టిన కేతిరెడ్డి



రాకుండా జేసీ అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి, పోరాటం చేసి మరీ ఇవాళ కేతిరెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టారు. 672 మంది పోలీసు బందోబస్తు నడుమ తన ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 15 నెలల తర్వాత తాడిపత్రికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు భద్రత కల్పించారని పేర్కొన్నారు. పోలీసులకు అన్నివిధాలుగా సహకరిస్తానని చెప్పారు. తాడిపత్రి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాడిపత్రిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్సెస్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేతిరెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయకుండా ఆయన్ను జేసీ అనుచరులు అడ్డుకుంటున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు కూడా కేతిరెడ్డిని వెనక్కి పంపించేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఆగస్టు 18వ తేదీన పోలీసులే స్వయంగా కేతిరెడ్డిని తాడిపత్రిలో దించిరావాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ అదే రోజున జేసీ వేరే ఈవెంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు తాడిపత్రికి రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కేతిరెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. కేతిరెడ్డిని తాడిపత్రికి రావద్దని ఆదేశించింది. దీనిపై తాజాగా కేతిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డికి అనుమతినిచ్చింది. అవసరమైతే ప్రైవేటు బందోబస్తును కూడా ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. ఈ క్రమంలో ఆయన భారీ పోలీసుల బందోబస్తు నడుమ తాడిపత్రిలోకి అడుగుపెట్టారు.

# నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు


మన గళం, అమరావతి : బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. శుక్రవారం అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది. మరోవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా రాజస్థాన్, గుజరాత్ వైపు కదులుతూ ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది.

అనకాపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. కొండకోపాక జాతీయ రహదారి వద్ద ఈదురు గాలులకు చెట్టు విరిగి పడిపోయింది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అనకాపల్లి గ్రామీణ సీఐ అశోక్ కుమార్ సిబ్బందితో వచ్చి చెట్టు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. కోనసీమలోని పలు లంక గ్రామాల ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 10 లంక గ్రామాల ప్రజలు గోదావరి నదీ పాయలను మరపడవల్లో దాటి రాకపోకలు సాగిస్తున్నారు. కోస్తా జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తొలుత వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆరెంజ్ ఎలర్ట్ జారీ చేసింది. అయితే శ్రీకాకుళం జిల్లాలో మినహా ఎక్కడా భారీ వర్షాలు కురవలేదు. కర్నూలు, విజయనగరం, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళిలో 91.7, పలాసలో 79.7, టెక్కలిలో 59 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మరి కొద్దిరోజుల పాటు వరద : గోదావరిలో మరో కొద్దిరోజులపాటు తొమ్మిది నుంచి పది లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగనున్నట్లు జల వనరుల శాఖాధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు అల్పపీడనం ప్రభావంతో వరద కొనసాగే అవకాశం ఉందన్నారు.

## పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండి జిల్లా కు కొత్త డాగ్

**– పేలుడు పదార్థాలు గుర్తించడంలో నైపుణ్యం**



మనగళం, కర్నూలు క్రైం : కేసుల చేధనలో, నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం హంటర్ జిల్లా పోలీసు శాఖకు రావడం జరిగిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. హంటర్ అనే నూతన జాగిలం విజయవాడ మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6 వ బెటాలియన్ లో 10 నెలల పాటు పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ పొందిందన్నారు. ఈ సంధర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన నూతన జాగిలాం హంటర్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డాగ్ స్క్వాడ్ మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. జాగిల%శీ%తో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య తొమ్మిదికి చేరుకుందన్నారు. హంటర్ అనే జాగిలం బెల్జియం మలనాయిస్ జాతికి చెందినదన్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ జావేద్, డాగ్ స్వాడ్ ఇంచార్జ్ ఎఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఎఆర్ కానిస్టేబుల్ శేఖర్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు నగరంలోని ఎన్.ఆర్ పేటలో రహ్మతీయ ఫౌండేషన్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రహ్మతీయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇర్షద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నందమూరి మోక్షజ్ఞ జన్మదిన వేడులు




మనగళం, కర్నూలు సిటీ : మోక్షజ్ఞ ఆర్గనైజెషన్ ఆధ్వర్యంలో పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ జన్మదిన వేడుకలను శనివారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఈ శిబిరం లో నందమూరి అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అధ్యక్షులు యస్. మోతిలాల్ మాట్లాడుతూ సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అని దివంగత నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి పేదల జీవితాల్లో వెలుగునింపారన్నారు. అలాగే నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యే గా ప్రజలకు సేవచేస్తూ, సినీ రంగం లో అగ్రకథా నాయకుడు వెలుగొందుతూ, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా ఎంతో మంది క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నారని చెప్పారు. తమవంతుగా ఆర్గనైజెషన్ తరపున క్యాన్సర్, తలసీమియా చిన్నారుల కోసం ప్రతి నెల రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఈరోజు 27వ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ నాగేంద్ర కుమార్, కన్వీనర్ రమేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఉదయ్ ప్రతాప్, కార్యదర్శులు నాగ సూరి, చిన్న, నందమూరి శ్రీను, మధు, పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పల్లెకు పోదాం

- **జిల్లా కలెక్టర్ చొరవతో వినూత్నంగా అమలు**
- **79 గ్రామాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్లు**
- **ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థల పనితీరును పరిశీలించిన అధికారులు**

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా చొరవతో "పల్లెకు పోదాం" అనే వినూత్న కార్యక్రమానికి శనివారం స్పెషల్ ఆఫీసర్లు శ్రీకారం చుట్టారు. ప్రతి మండలానికి మూడు గ్రామాల చొప్పున 79 గ్రామాల్లోస్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, హాస్పిటల్స్, హాస్టల్స్, రైతు సేవా కేంద్రాలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు తదితర ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేశారు. అలాగే రోడ్లు, నీటి సరఫరా, ఇళ్ళ నిర్మాణాలు తదితర అంశాలను కూడా పరిశీలించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను, పరిష్కరించాల్సిన సమస్యలను పల్లెకు పోదాం ఆన్లైన్ వెబ్సైట్ లో పొందుపరిచారు. వీటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.



**– పర్ల గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**



కల్లూరు మండలం పర్ల గ్రామంలో శనివారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆ గ్రామాన్ని సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓహెచ్ఎస్ఆర్, అంగన్వాడీ కేంద్రం, ఆస్పత్రి, గ్రామ సచివాలయం, సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను గుర్తించి, పనులను మంజూరు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్ నిర్మాణాలకు మంజూరు చేశారు. గ్రామ సచివాలయం ఎదురుగా, అంగన్వాడీ కేంద్రం ఎదురుగా రోడ్లు బాగాలేకపోవడంతో సిమెంట్ రోడ్లు మంజూరు చేశారు. అలాగే సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నిర్మాణంలో ఆగిపోయిన భవనాలను పూర్తిచేస్తామని తెలిపారు. పర్ల నుండి చిన్న టేకూరు, సింగవరం వెళ్ళే ఆర్ అండ్ బీరోడ్డుపై ఉన్న కల్వర్టు బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా మంజూరు చేశారు.

**– మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిగా అందించాలి**

తొలుత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి,కిచెన్ షెడ్, టాయిలెట్స్, నీటిసరఫరాను పరిశీలించారు. కిచెన్ షెడ్ బాగోలేదని, బాగు చేయిస్తామని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిగా అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు..కేవలం 5 నెలలు మాత్రమే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఖచ్చితంగా 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్ ను పరిశీలిస్తూ ప్రతి రోజు క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ని ఆదేశించారు.

**– సెప్టెంబర్ చివరికి ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి**

గ్రామంలో ఈ క్రాప్ బుకింగ్ శాతం తక్కువగా ఉందని, పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా సెప్టెంబర్ చివరి నాటికి ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కి సంబంధించి గ్రీవెన్స్ లు ఏమైనా పెండింగ్ లో ఉన్నాయా అని కలెక్టర్ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు.. పెన్షన్ వస్తోందా, ఇంటి దగ్గరికే వచ్చి ఇస్తున్నారా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు వచ్చాయా అంటూ ఆరా తీశారు. అన్నీ వచ్చాయని గ్రామస్థులు తెలిపారు. పెన్షన్లు లేని వారు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, ఇల్లు, ఇంటి స్థలం లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తూ పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మరియు వెల్నెస్ కేంద్రం (విలేజ్ క్లినిక్-2) ను ఆ%శ్రీశ్రీ% తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. క్లినిక్‌లో వైద్యం కోసం వచ్చిన అక్కమ్మ (60)తో కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మంచి వైద్య సేవలు అందుతున్నాయా, మందులు బాగానే ఇస్తున్నారా ? అని ప్రశ్నించారు. సిబ్బంది చాలా బాగా చూసుకుంటారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి హాస్టల్‌లోని స్టోర్ రూమ్, గదులు, వసతి సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

**– పత్తి పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

పత్తి పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రైతులతో ముచ్చటించారు. పంట పరిస్థితులు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడి, విక్రయాలు వంటి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. మిన్నల అనే రైతుతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో పత్తి పొలం సాగు చేస్తున్నారు? ఎకరాకు ఎంత ఖర్చు అవుతోంది? పత్తి దిగుబడి ఎలా ఉంది? వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి ఈ క్రాప్ నమోదు చేశారా? అని ప్రశ్నించారు. దీనికి రైతు



స్పందిస్తూ 7 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాము. ఈసారి వర్షాలు బాగా కురవడంతో పంట బాగా ఉంది. ఎకరాకు సుమారు రూ. 40వేల వరకు ఖర్చు అవుతోంది. పత్తిని ఆదోని లేదా నాగలాపురం మార్కెట్లలో విక్రయిస్తాము. వ్యవసాయ శాఖ అధికారులు పొలానికి వచ్చి ఈ క్రాప్ నమోదు చేశారు అని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు ఎంపీడీఓ జి. ఎన్.ఎస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులను ఆదుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : పోలకల్ గ్రామ రైతు ఆత్మహత్య ప్రయత్నం చూసైనా ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సి బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన ఉల్లి రైతు వెంకటేష్ నాయుడు ఉల్లి పంటకు క్వింటా రూ. 3 వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో వేసిన ఉల్లి పంటకు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలే తప్ప ఆచరణలో రైతుల గోడు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎకరా ఉల్లి సాగుకు పెట్టుబడి 1,20,000 అవుతుందని, మార్కెట్లో కేవలం రూ. 600 క్వింటాలు ధర పలుకుతుందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఉల్లి రైతులలో ప్రభుత్వం పైన పూర్తి వ్యతిరేకత రాకముందే గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జీఎన్ ఎమ్ నర్సింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య డైరెక్టరేట్ 2025-26 విద్యాసంవత్సరానికి జీఎన్ఎం నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆసుపత్రి అడిషనల్ డీఎం ఈ అండ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతాయన్నారు. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం), కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హతలు, వయోపరిమితి, దరఖాస్తు విధానం, సీట్ల లభ్యత వంటి పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో పొందుపరిచామన్నారు. నర్సింగ్ రంగంలో చదువుకు మంచి అవకాశాలు ఉన్నాయని, ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. 22/09/2025 వరకు దరఖాస్తులు స్వీకరించబడును అని అన్నారు.

## ఏఐబీఈ మోడల్ పరీక్ష

మనగళం, కర్నూలు సిటీ : భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో కర్నూల్ బార్ అసోసియేషన్ లో శనివారం ఏఐబీఈ మోడల్ పరీక్ష సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐ ఏ ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రంగనాథ్ మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్ ) మోడల్ టెస్ట్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. న్యాయవాదుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే ఏకైక సంఘం ఐ ఏ ఎల్ అన్నారు. కర్నూల్ బార్ అసోసియేషన్ నాయకుడు ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలకు నిర్వహించడానికి అసోసియేషన్ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఏఐబీ ఈ మోడల్ పరీక్షకు దాదాపు 20 మెంబర్స్ పాల్గొనడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి .దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి షఫీ, డోన్ న్యాయవాది జీవన్ బాబు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జీఎస్టీ సంస్కరణలతో ప్రభుత్వానికి రూ. 3,700 కోట్ల నష్టం

మనగళం, వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలలో భాగంగా రేట్ల తగ్గింపు ద్వారా ప్రభుత్వానికి రూ. 3,700 కోట్ల ఆదాయ నష్టాన్ని ఏర్పడుతుందని ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తాజా నివేదిక పేర్కొంది.ఈ రేట్ల కోత వల్ల ఏడాదిలో రూ. 48,000 కోట్ల నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేయగా, వ్యవస్థలో వినియోగంతో పాటు వృద్ధి పుంజుకోవడం మూలంగా అంతిమ నష్టం రూ. 3,700 కోట్లకు పరిమితమవుతుందని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. ఇదే సమయంలో ఆర్థిక లోటుపై ప్రభావం ఉండకపోవచ్చని పేర్కొంది. జీఎస్టీ రేట్లను సవరించడం ద్వారా బ్యాంకింగ్ రంగంలో ఖర్చులు తగ్గుతాయి. ఫలితంగా మొత్తం బ్యాంకింగ్ కార్యకలాపాల్లో సానుకూల ప్రభావం ఉంటుంది. గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లు ఉండేవి.

# ఆడపిల్లలను బతికించు... చదివించు




మనగళం, కర్నూలు సిటీ : స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంకల్ప ప్రోగ్రాము లో పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం లో భాగంగా శనివారం ఏ క్యాంపు ఇందిరాగాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆడపిల్లల పుట్టుక, చదువు అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పి. విజయ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్యం గురించి వివరించారు. అలాగే ఏ క్యాంపు అర్బన్ హెల్త్ సెంటర్లో ఆశ కార్యకర్తలు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఓ ఎస్ సీ సేవలు, 181,1098,1030,112 సైబర్ క్రైమ్ గురించి తెలియజేసారు. కార్యక్రమం లో వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్ వీ. జోష్టనా, ఏ ఎస్ ఐ జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మనగళం, కర్నూలు సిటీ : పేద ప్రజల ముంగిటకు వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూల్ జిల్లా మెడికల్ ఆఫీసర్ 104 ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. కూటమీ ప్రభుత్వం 104 సేవలను మరింత మెరుగుపరచడానికి ప్రయత్నం చేసి నూతన యాజమాన్యాన్ని నియమించడం జరిగిందని ఉద్యోగులు తెలిపారు. అయితే భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు గతం నుంచి పని చేస్తున్న ఉద్యోగులందరికీ వేతనాలను తగ్గించడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి సరైన సమాధానాలు ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని ఉద్యోగులు ఆరోపించారు. తమ సమస్యలపై రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. సెప్టెంబర్ 9 వ తేదీ వరకు వివిధ రూపాల్లో మా సమస్య లను ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుండి తగ్గించిన జీతాలు బకాయిలతో సహా ఇప్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా 104 ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలి, మాజీ యాజమాన్యం అరబిందో నుండి బకాయిలను, చట్టపరమైన చెల్లింపులను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణి, సీనియర్ డ్రైవర్ ఇలియజ్, హాసన్ షరీఫ్, మంజుల, వినోద్ మల్లికార్జున, మధు, అజమ్,తదితరులు పాల్గొనడం జరిగింది.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం



**– ఆల్ ఇండియా డ్రైవర్స్ మహాసంఘ్ వైస్ ప్రెసిడెంట్ అన్వర్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : డైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు కొనసాగిస్తామని ఆల్ ఇండియా డ్రైవర్స్ మహాసంఘ్ వైస్ ప్రెసిడెంట్ అన్వర్ బాషా తెలిపారు. డ్రైవర్స్ డే సందర్భంగాసెప్టెంబర్ 1 బీహార్లోని పాట్నలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ ఎస్ అన్వర్ బాషా, జిల్లా సహాయక కార్యదర్శి మౌలాలి తదితరులు వెళ్లారు. ఈ సభలో ఆల్ ఇండియా డ్రైవర్స్ మహాసంఘ్ లో మన సౌత్ ఆంధ్రప్రదేశ్ కర్నూలు కు చెందిన ఎస్ అన్వర్ బాషా కు వైస్ ప్రెసిడెంట్ గా అవకాశం కల్పించారు. ఈ మేరకు శనివారం కర్నూలులోని సంఘం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా డ్రైవర్స్ మహాసంఘ్ వైస్ ప్రెసిడెంట్ అన్వర్ బాషా మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ లో చనిపోయిన డ్రైవర్ కుటుంబానికి రూ. 20 లక్షలు అందించాలని, ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే డ్రైవర్ల మీద జరిగే దాడులను అరికట్టాలంటే భద్రతా చట్టం చేయాలన్నారు. అలాగే డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డు, డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు డ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విడతలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# కర్నూలు టిడ్కో గృహ సముదాయానికి సకల సౌకర్యాలు

**– రాష్ట్రంలోని 163 టిడ్కో గృహాలు మార్చి 31కి అందుబాటులోకి**
**– మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ**



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రంలోని 163 టిడ్కో గృహ సముదాయాలు మార్చి 31 వ తారీకు అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ కర్నూలు శివారులో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలోరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 7 లక్షల టిడ్కో గృహాలకు అనుమతించగా అందులో 5 లక్షల గృహాలకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తీసుకొని 4 లక్షల 74 వేల గృహాలకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ఆ తర్వాత 2019 లో వచ్చిన ప్రభుత్వం దానిని 2 లక్షల 61 వేలు మాత్రం చాలని కుదించిందన్నారు. సింగపూర్, మలేషియా, జపాన్, చైనా, రష్యా మొదలగు అభివృద్ధి చెందిన దేశాలలో షేర్ వాల్ టెక్నాలజీ తో గృహాలు నిర్మాణాలు చేస్తారని, అదే టెక్నాలజీని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని ఆలోచించిందని చెప్పారు. అప్పుడే భారతదేశంలో ఎక్కడ జరగని విధంగా టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ గృహాలలో "ఏ" గ్రేడ్ వర్టిఫైడ్ టైల్స్, కిచెన్ లో గ్రానైట్ బండ, అవసరమైన చోట అటకలు, వాల్ పుట్టి,షేర్ వాల్స్ మొదలగు సౌకర్యాలతో గృహ నిర్మాణం చేయడం జరిగిందని, సౌకర్యవంతమైన రోడ్లు, డ్రైనేజీ పార్కులు, కమ్యూనిటీ హాల్, స్కూలు మొదలగు వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అయితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వీటిని పాటించకుండా మేము అత్యున్నత స్థాయి రంగులు వేయించగా వాటిని పక్కన పెట్టేసి తమ పార్టీ రంగులు వేశారని, ఇప్పుడు మాకు ఖాళీ ఖజానా అప్పజెప్పడం జరిగిందని ఆరోపించారు. 10 లక్షల కోట్లు అప్పు రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందని, ప్రజల నుండి వచ్చే పన్నులు అప్పులు తీర్చడానికి సరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తూ ఉన్నారని, ప్రభుత్వం వచ్చిన వెంటనే మూతబడిన పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను తెరిపించి నడిపిస్తున్నామని, ఇంకా 70 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాలో రెండు నెలలలో మరికొన్ని అన్న క్యాంటీన్ లు పనిచేస్తాయని చెప్పారు. కర్నూలులో పదివేల టిడ్కో గృహాలు... ఇందులో 40 వేల మంది నివాసయోగ్యంగా ఉండే టౌన్షిప్ ను గత పాలకులు ఆపేశారన్నారు. రాష్ట్రం మొత్తం 163 టౌన్షిప్ ల నిర్మాణాలు పూర్తి చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ రోజు కర్నూలుకు రావడం జరిగిందని, ఇక్కడ ఉన్న కంప చెట్లు జంగిల్ క్లియరెన్స్ రేపటి సాయంకాలంలో గా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి గాను 1కోటి రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 2,064 గృహాలు పూర్తి చేసి తాళం లబ్ధిదారులకు అందజేశారన్నారు. 1054 గృహాలు ఈ మధ్యనే పూర్తి చేశారని, వీటిని మున్సిపల్ కమిషనర్ కి స్వాధీనపరిచి స్థానిక ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు అందజేసే చర్యలు చేపడతారన్నారు. డిసెంబర్ నాటికి 3,056 గృహాలను పూర్తి చేస్తారని, మిగిలిన 3826 గృహాలు మార్చి 31 తారీఖు నాటికి పూర్తి చేస్తారన్నారు. స్థానిక మంత్రి టి జి భరత్ కోరిక మేరకు ఇక్కడే పది ఎకరాల స్థలాన్ని ఎంఎస్ ఎం ఈ క్రింద పరిశ్రమల ఏర్పాటు చేయడానికి ఇస్తున్నామని, దీనివలన ఈ కాలనీలో ఉండే వెయ్యి మంది కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ మంత్రి నారాయణ ఈ కాలనీకి చెందిన పది ఎకరాల స్థలాన్ని ఎం ఎస్ ఎం ఈ క్రింద పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఇవ్వవలసిందిగా కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ జగన్నాథ గట్టు వద్ద 10 వేల టిడ్కో గృహాలు గత టీడీపీ ప్రభుత్వం 2014-19 సమయంలో శాంక్షన్ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని, మరలా మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లబ్ధిదారులకు ఇల్లు అందజేయాలనే ఉద్దేశంతో ఇక్కడున్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా మంత్రి వర్యులు వచ్చారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ టిడ్కో గృహాల వద్ద తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మంత్రి నారాయణ 6 కోట్ల రూపాయలను శాంక్షన్ చేయడం సంతోషకరమన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, టిడ్కో ఇంజనీర్ డాక్టర్ పెంచలయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీల నిర్మాణాలు పూర్తి చేస్తాం

**– మంత్రి నారాయణ**



మనగళం, కర్నూలు సిటీ : టిడ్కో ఇళ్ల నిర్మాణాల విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ పథకం నీరుగారిపోయిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో మిగిలిపోయిన పనుల్ని పూర్తి చేస్తున్నామని చెప్పారు. సోమవారానికి 6 కోట్ల నిధులు మంజూరవుతాయని... నిర్మాణాల పూర్తి, మౌలిక వసతుల ఏర్పాటుతోపాటు అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. 2026 మార్చి నెలాఖరునాటికి ఏపీలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలన్నీ కంప్లీట్ అవుతాయని హామీ ఇచ్చారు. కర్నూలు పరిధిలోని జగన్నాథగుట్టులో ఉన్న టిడ్కో కాలనీని మంత్రులు నారాయణ, టీజీ భరత్ శనివారం పరిశీలించారు. కర్నూలులో 10వేల ఇళ్లు మంజూరయ్యాయని, అయితే మౌలిక వసతులు లేక ప్రజలు అక్కడ నివాసం ఉండటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం తప్పుల్ని సరిచేస్తున్నామని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేశామన్నారు. జగన్నాథగట్టులో ఉన్న టిడ్కో కాలనీలో సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు నారాయణ, టీజీ భరత్. టిడ్కో ఇళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారంకోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 7 లక్షల టిడ్కో ఇళ్లను మంజూరు చేశామని మంత్రి నారాయణ గుర్తు చేశారు. అప్పట్లో 5 లక్షల ఇళ్లకు అడ్మిస్ట్రేటివ్ అనుమతులిచ్చామని, 4 .74 లక్షల ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని వివరించారు. మహిళలు సొంతింటిలో సంతోషంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు ఆకాంక్ష మేరకు, దేశంలో ఎక్కడా లేనివిధంగా షీర్ హెూల్డ్ టెక్నాలజీ తో ఇళ్ళు నిర్మించామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమపై కక్షతో టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేసిందని, వాటి సంఖ్యను 2 .61 లక్షలకు కుదించిందని చెప్పారు. రాష్ట్రంలోని 163 టిడ్కో టౌన్ షిప్ లో పనులు పునః ప్రారంభిస్తున్నామని చెప్పారు. టిడ్కో కాలనీ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఈ ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు 10 ఎకరాల భూమి కేటాయించామని చెప్పారు. దీని ద్వారా 1000మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్టుగా వచ్చే మార్చిలోగా నిర్మాణాలు పూర్తవుతాయని అన్నారు మంత్రి టీజీ భరత్. ప్రభుత్వం 6 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని, నిర్మాణాలు, మౌలిక వసతుల ఏర్పాట్లు కూడా పూర్తవుతాయని చెప్పారు. టిడ్కో ఇళ్ల సమస్యలపై నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, నగర కమిషనర్ పి.విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ నవ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ట్రంప్ టారిఫ్ లకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఇబ్బడి ముబ్బడిగా పెంచిన ట్రంప్ టారీఫ్ లకు వ్యతిరేకంగా సీపీఎం,సీపీఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి నిర్మల, టి రాముడు, ఎండి ఆనంద్ బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, ఎన్ లెనిన్ బాబు మాట్లాడారు. ట్రంపు భారతదేశంపై వేసిన పన్ను కారణంగా దేశంలో అత్యధికంగా నష్టపోయేది ఆంధ్ర రాష్ట్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. 40 శాతం పన్ను విధింపు ద్వారా ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పత్తి పంటపై 11 శాతం ఉన్న దిగుమతి పన్ను ను ఎత్తివేయడం ద్వారా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అనైతిక పన్ను విధానం ద్వారా దేశాన్ని నష్టపరిచే విధంగా ట్రంపు ప్రయత్నిస్తూ ఉంటే ట్రంపు మిత్రుడుగా ఉన్న మోడీ ఎలాంటి మాట కూడా మాట్లాడడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి పాలకులకే కాక ప్రతిపక్ష జగన్ మోహన్ రెడ్డికి కూడా పట్టడం లేదని వారు విమర్శించారు. నాడు వామపక్షాలు జీఎస్టి అన్నది దేశానికి నష్టం అని మొత్తుకున్నా అమలు చేసిన బిజెపి సర్కారు, ఈనాడు దొడ్డి దారిన జీఎస్టీ ని ఎత్తేసే ప్రయత్నం చేయక తప్ప లేదన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ పెద్దన్నగా ఉన్న అమెరికా పన్నుల భారంతో దేశాలను తమ చెప్పు చేతుల్లో పెట్టుకోవాలనే ఆలోచనకు తెరతీసిందని, ఇది ఆ దేశ పెట్టుబడిదారీ విధానాన్ని ఇరకాటంలో పెట్టేదన్నారు. దేశ ప్రజలపై భక్తి కలిగిన వామపక్షాలుగా అమెరికా విధిస్తున్న సుంఖాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జగన్నాథం, శ్రీనివాసులు, రామాంజనేయులు, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప, రామకృష్ణ, షరీఫ్, అబ్దుల్ దేశాయ్, విజయమ్మ, అబ్దుల్లా, భాస్కర్, యేసు రాజు, కృష్ణ, రఫీ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

అజారామరాలు...

ఉషశ్రీ పురాణ వ్యాఖ్యానాలు

తెలుగు వారికి పరిచయం అక్కర్లేని పేరు ఉషశ్రీ. తెలుగునాట ప్రఖ్యాతి గాంచిన రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా, తమ రామాయణ భారత ప్రవచనాల ద్వారా తెలుగుసీమలో ఉషశ్రీ అందరికీ సుపరిచితులు. అప్పట్లో ఆయన గొంతుని, మాట సరళిని గుర్తు పట్టలేని తెలుగు శ్రోతలు లేరంటే అది అతిశయోక్తి కానేకాదు. ధర్మ సందేహాలు అనే పదబంధం వినబడితే ఉషశ్రీ గుర్తుకు రాక మానరు. ఆకాశవాణి ద్వారా ఆ కార్యక్రమాన్ని అంతగా ప్రాచుర్యం గావించారు ఉషశ్రీ. పురాణ ప్రవచనంలోనే కాక ప్రత్యక్ష వ్యాఖ్యానాల లోనూ తెలుగు శ్రోతలపై చెరగని ముద్ర వేసిన 'గళగంధర్వుడు' ఉషశ్రీ. తెలుగు దేశంలో రేడియో స్వర్ణయుగ వైభవాన్ని శిఖరస్థాయికి చేర్చిన దిగ్దంతులలో అగ్ర తాంబూలం ఆయనదే అనడం అతిశయోక్తికాదు. ఉషశ్రీ (మార్చి 16, 1928 - సెప్టెంబరు 7, 1990) అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో 1928 (ప్రభవ తెలుగు సంవత్సరం) సంవత్సరం మార్చి 16 (ఫాల్గుణ బహుళ త్రయోదశి) న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యులు పురాణపండ రామూర్తి, తల్లి కాశీ అన్నపూర్ణ. వారికి నలుగురు సంతానం. డాక్టర్ గాయత్రి, పద్మావతి, వైజయంతి, కళ్యాణి.జాతీయోద్యమ సమయంలో కాకినాడలో కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక వేదికల ద్వారా రామాయణం, మహాభారతం మహాభాగవతం ప్రవచనం చేశారు. ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు భారత, రామాయణ, భాగవతాలను ప్రతి వారం సీరియల్‌గా చెపుతూ, అశేష తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించారు. పురాణాలను పుక్కిట పట్టిన సాహితీ ద్రష్ట. రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతు వాదులనూ, అవి పరమ పవిత్రమయిన మత గ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాల లోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించ గలిగాయనీ ఉషశ్రీ స్పష్టం చేశారు. రేడియోలో ఉషశ్రీగా పేరొందక ముందు కవిత్వం, గేయాలు, యక్షగానాలు, ఎన్నో కథలు, నవలికలు రాసారు. ఎమెస్కో వారు కూడా ఎన్నో ప్రచురించారు. రేడియోలో వార్తలు కూడా చెప్పేవారు. రేడియో నాటకాలు రాసేవారు. రేడియో నాటకాల్లో పాల్గొనేవారు. 1973 లో రేడియోలో భారత ప్రవచనం ప్రారంభించాడు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. అప్పట్లో, దూరదర్శన్ లేదు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. ఆయన ఉచ్చారణ ఎంత గంభీరమో, రచనా శైలి కూడా అంతటి నారికేళపాకంగా ఉండేది. శ్రోతలు రేడియోల ముందు నుండి కదలక ఉండేవారు. భగవద్గీతను, సుందరాకాండను పండిత పామరులను అలరించేలా, అందరికీ అర్థమయ్యేలా చేశారాయన. ధర్మసందేహాల కార్యక్రమం రేడియోలో వస్తూంటే పండిత పామరులనే బేధాల్లేకుండా రేడియోకి అతుక్కుని పోయేవారు. అయన కార్యక్రమం ప్రారంభం అయినంటే, రిక్షా కార్మికులు మొదలుకొని, రోడ్లపై నడిపేవారు కూడా ఆగి, రేడియో ఉన్న షాపు వద్ద విని వెళ్ళేవారు. రోడ్లపై జనసంచారం ఉండేది కాదు. నేటి క్రికెట్ మాచ్ కి మించిన ప్రజాదరణ పొందిన కార్యక్రమం అది. మొదట శనివారం నాడు పది నిమిషాల కార్యక్రమంగా మొదలై తరువాత శ్రోతల కోరికపై అరగంట, ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మార్చక తప్పలేదు. ఉషశ్రీ వాణి, ప్రత్యేకమైన బాణీ శ్రోతల్ని యెంతగా ఉర్రూత లూగించేవంటే వ్యాసపీఠం ప్రసారాల్ని నిలిపి వేసినప్పుడు రెడియో స్టేషన్ యెదుట ధర్నాలు కూడా జరిగేవి. ఉషశ్రీ స్వరానికి వున్న పాపులారిటీకి అది మచ్చు తునక. దీన్ని బట్టి ఆయన కార్యక్రమాలు శ్రోతలను ఎంతగా ప్రభావితం చేశాయో స్పష్టం అవుతున్నది. 1979 లో పి.వి.ఆర్.కె ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్నపుడు ఉషశ్రీ చేత భాగవతం రాయించి పాతికవేల ప్రతులు ముద్రింప జేసి అతి తక్కువ ధరలో భక్తులకు అందించారు. అయితే ఆయన రెండున్నర రూపాయలకు విక్రయించే చర్యలు గైకొనగా, తర్వాత వచ్చిన అధికారులు తొమ్మిది రూపాయలకు పెంచారు. భారతం, రామాయణాలు కూడా పదివేల ప్రతులు ముద్రించి కృష్ణా పుష్కరాల సమయంలో విడుదల చేశారు. దైవభక్తి, దేవుడిమీద అచంచల విశ్వాసం, జాలి, దయ, కరుణ, సున్నితత్వం, సేవా దృక్పథం, ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ఆయన స్వభావం. ఆయన తనకు మాత్రమే తెల్సి ఇంకెవ్వరికీ చెప్పకుండా చేసిన సాయాలు, దానాలెన్నో. మానవ విలువలు, సంబంధాలకు ఎంతో విలువ నిచ్చేవారు. 1986-90ల మధ్య ఆంధ్రజ్యోతి, స్వాతి వారపత్రికలలో ఉషశ్రీ పాఠకుల ధర్మసందేహాలకు సమాధానాలు కార్యక్రమం నిర్వహించారు. వీరకాకాని అంతిమ యాత్ర, భారత మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన రాజమండ్రి - కొవ్వూరు మధ్య గోదావరి నదిపై నిర్మించిన రోడ్ - కమ్ రైలు వంతెన ప్రారంభోత్సవం, భద్రాద్రి రామయ్య కల్యాణం, కృష్ణా పుష్కరాల సందర్భంగా తొలి ప్రత్యక్ష వ్యాఖ్యానం లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాద్ పర్యటన సందర్భంగా చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం, తదితరాలు ఆయన వాగ్ధాటి, సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, సమయోచిత సందర్భానుసార పద ప్రయోగ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. రాజాజీ ప్రసంగాలను అనువదించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్.

పత్తికొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్. పత్తికొండ నియోజకవర్గంలోని 9 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. నాలుగు లక్షల 81 వేల రూపాయలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులనుపత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.










## యశోద ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం.... డాక్టర్ సుంకన్న



మన గళండోన్ ఈ నెల 7న అనగా ఆదివారం యశోద ఆసుపత్రిలో ఉచిత వైద్యం శిబిరాన్ని ఏర్పాటు చేయడమేమైనదని డాక్టర్ సుంకన్న తెలిపారు. విష జ్వరాలు ప్రభలుతున్న నేపద్యంలో చిన్నారులకు అలగే పెద్దల కోసం కంటి, ఎముకల సమస్యలు కీళ్ళకు సంబంధించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని డోన్ ప్రజలు చుట్టుపక్కల ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎమ్మిగనూరు ఎంఈఓను సస్పెండ్ చేయాలి



మనగళం, ఎమ్మిగనూరు : ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ఎమ్మిగనూరు ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రవీంద్ర భారతి, శారద కమిటీ పాఠశాలల ఎదుట నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు ఉదయ్ శేఖర్, ఆఫ్రిది రఘునాథ్, కృష్ణ, కాజా మాట్లాడుతూ ఈ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులు చే బోధించడం జరుగుతుందని, విద్యార్థులు తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలను ఎఈవోకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ స్కూళ్లలో కనీస వసతులు లేవని, ఫీజులు మాత్రం ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మిగనూర్ ప్రైవేటు పాఠశాలకు వత్తాసు పలుకుతున్న మండల విద్యాధికారి ఆంజనేయులు ను సస్పెండ్ చేసి శ్రీరామ, నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ మండలంలోని కనపకుంట గ్రామానికి చెందిన యువకుడు చరణ్ ఈతకు వెళ్లి దురదృష్టకరంగా మృతి చెందిన ఘటనపై డోన్ శాసనసభ్యులు గౌరవనీయులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతదేహానికి

నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కలుసుకుని పరామర్శించిన ఎమ్మెల్యే కుటుంబానికి సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని, అవసరమైన సహాయం అందించడానికి కోట్ల కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## అంబాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధమై నష్టపోయిన రైతును ఆదుకోవాలిలిసిపిఐ డిమాండ్

- పశుగ్రాసం నష్టపోయిన రైతు రామచంద్రుడు
- మూడు లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించి ఆదుకోవాలి
- భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్



మన గళం బేతంచర్ల మండలం అంబాపురం గ్రామంలో శు క్రవారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురై పశుగ్రాసాన్ని నష్టపోయిన రైతు రామచంద్రుడు గడ్డివాములను సందర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాలూకా తిరుమలేష్, అంబాపురం గ్రామశాఖ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ లు డిమాండ్ చేశారు గ్రామానికి చెందిన రైతు గొర్లగుట్ట రామచంద్రుడు కు చెందిన సుమారు 3 లక్షలు విలువ చేసే పశుగ్రాసం నిన్నటి రోజు శు క్రవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైందని పశువుల కోసం నిల్వ ఉంచిన పశుగ్రాసం అన్నికి ఆహుతి కావడం ద్వారా పశువులకు తిండి లేకుండా పోయిందని మళ్లీ కొనాలంటే డబ్బులు వెచ్చించాలని పరిస్థితిలో రైతు ఉన్నాడన్నారు గతంలో అనేక మార్లు ప్రమాదాలు సంభవించి రైతులు నష్టపోతున్న ప్రభుత్వ అధికారులు ఎలాంటి చరణం లేదని కావున తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి రైతుకు మూడు లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సామన్న శ్రీరాములు శంకర్ ప్రదీప్ బాలు మధు శ్రీమన్నారాయణ రవి తదితరులు పాల్గొన్నారు



# అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న పన్నులపై ప్రధాని నోరు మెదలకపోవడం దుర్మార్గం:- సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్.







మన గళండోన్ భారతదేశ దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం పన్నులు పెంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోరు మెదలకపోవడం చాలా దుర్మార్గమని సిపిఎం పార్టీ పట్టణ,మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్ రామాంజనేయులు,కమిటీ సభ్యులు చిన్న రహిమాన్, నాగమద్దయ్య అన్నారు శనివారం సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు భారతదేశంలో ట్రంప్ విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూభారతీయ సరుకుల దిగుమతులపై 50 శాతం పన్నులు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం వల్ల మన ఉత్పత్తులపై తీవ్రంగా ప్రభావం పడింది ఆక్వా టెక్స్టైల్స్ గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయి దేశ సముద్ర ఉత్పత్తులలో 40% ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయి ఏటా సుమారు 2000 కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి మన రాష్ట్రం నుండి రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్రతీర ప్రాంతంలోని రొయ్యలు చేపలు రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు అలాగే గార్మెంట్స్ టెక్స్టైల్స్ రంగాలలో అనకాపల్లి శ్రీ సత్య సాయి గుంటూరు పల్నాడు వంటి జిల్లాల్లోని ఫ్యాక్టరీలు స్పిమ్మింగ్ మిల్లు లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధికి ఎసరు వస్తుంది ఇందులో అత్యధిక గ్రూప్ మహిళా శ్రామికులు కావడం గమనార్హం, మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతున్నది అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం కాల పరిమితి తగ్గించడం జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థుల కలలు పేక మెడల కూలిపోతున్నాయి ఇప్పటికె అమెరికా వెళ్లిన వారి పరిస్థితి కూడా అగమ్య గోచరంగా ఉంది అన్నివిధాలుగా ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాల్ని సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్న కేంద్రంలోని మోడీ సర్కార్ కిమ్మనకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదు ట్రంప్ తో సహా అమెరికా పెత్తందారులు భారతదేశాన్ని అవమాన పరుస్తూ ప్రకటన చేస్తున్న మోడీ ప్రభుత్వం కిమ్మనడం లేదని వారి ఆగ్రహం వ్యక్తం చేశారు.మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలునిలబడాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నక్కి హరి,షేమిమ్ బేగం, సిరినా, రాజ్ కుమార్, బీబీ, ఖాజా ఉస్సేన్, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు కావాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : విద్యార్థులు చదువుతో పాటు పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు.నంద్యాల పట్టణంలోని శ్రీ శారద విద్యాపీఠం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన గణిత విజ్ఞానమేళా, సాంస్కృతిక మహోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జ్ఞానానికి కంటే పవిత్రమైనది ప్రపంచంలో ఏదీ లేదని, విద్య కేవలం మార్కులు సాధించేందుకే కాకుండా ఉన్నత విలువలను పెంపొందించుకోవడానికి ఉపయోగపడాలని సూచించారు. విద్యార్థుల గుణగణాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర అపూర్వమని తెలిపారు. భారతదేశం పురాణకాలం నుంచే జ్ఞాన మహాశక్తిగా నిలిచిందని, వేదాలు, పురాణాలు మనిషి నడవడికను తీర్చిదిద్దాయని గుర్తు చేశారు. ఆర్యభట్ట, చరక, సుశ్రుత, ఆదిశంకరాచార్య, రామకృష్ణ పరమహంస వంటి మహనీయులు జ్ఞానానికి కొత్త దిశలు చూపారని వివరించారు. స్వతంత్రం తరువాత ఆధునిక సాంకేతికతతోపాటు భారతీయ విలువలను కలిపి బోధించడానికి విద్యా భారతి వంటి సంస్థలు ఏర్పాటయ్యాయని తెలిపారు. తన విద్యార్థి దశలో భారతీయ విద్యా కేంద్రంలో పొందిన పునాది వల్లనే ఆల్ ఇండియా స్థాయిలో 8వ ర్యాంకు సాధించి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగంలో ఎమ్మెస్సీ పూర్తి చేయగలిగానని గుర్తు చేశారు. జీవితంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందాలంటే వస్త్రం, వపుషా, వాచా, విద్య, వినయం అనే ఐదు విలువలను ఆచరించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు శారద విద్యాపీఠం అందిస్తున్న విద్యా విధానాలను అభినందించారు. విద్యార్థులు ఆలపించిన ప్రార్థన గేయం, శాంతి మంత్రం ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ జనార్ధన్ రెడ్డి, మంత్రి ఎన్డీ ఫరూక్ కుమారుడు ఎన్ఎండీ ఫయాజ్ బాషా, విద్యా భారతి సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ప్రతాపసింహశాస్త్రి, అనంతపురం సరస్వతి విద్యాపీఠం సమితి అధ్యక్షుడు డా. గడ్డం రామకృష్ణారెడ్డి, పాఠశాల మేనేజర్ వసుంధర దేవి, ప్రధానోపాధ్యాయుడు కె. వెంకటకృష్ణయ్య, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆందోళన

మన గళం కోడుమూరు: భారతదేశంపై అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా కోడుమూరు సిపిఐ పార్టీ పట్టణ సమితి ఆధ్వర్యంలో శనివారం కోట్ల సర్కిల్లో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధు అధ్యక్షతన ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేషకుమార్,లు మాట్లాడుతూ భారతదేశం వ్యతిరేకంగా అమెరికా ఆంక్షలు విధిస్తూ ఉంటే మోడీ మౌనం వహిస్తున్నారని వారు విమర్శించారు. ఇప్పటికే 25%నుండి 50% వరకు సుంకాలను పెంచడం ఇంకా పెంచుతానని ట్రంప్ చెబుతున్నప్పటికీ ప్రధాని మోడీ వ్యతిరేకించడం లేదన్నారు అమెరికాలో చదివే విద్యార్థులకు వీసాలు పెంచడం, మన దేశంలోని తల్లిదండ్రులు అమెరికాలో చదివే పిల్లల ఖర్చులకు డబ్బులు పంపితే వాటిపైన కూడా సుంకాల పేరుతో కోత విధించడం, మనదేశం విద్యార్థులకు అమెరికాలో పార్ట్ టైం ఉద్యోగాల్లో పెట్టుకోకూడదని అక్కడి కంపినీలకు శరత్తులు విధించడం దారుణమైన విషయం అన్నారు. అమెరికా ఉత్పత్తి చేసే పండ్లు, పాలు, వ్యవసాయ సామాగ్రి ని మనదేశం దిగుమతికి అంగీకరించలేదని, ప్రపంచ శాంతిదూతగా ట్రంప్ పేరు ప్రతిపాదించలేదనే అక్కసుతోనే ట్రంప్ టారిఫ్ లను విధించి కేవలం రష్యా తో క్రూడ్ ఆయిల్ కొంటున్నారనే సాకుజూపి సుంకాలను 50% కంటే ఇంకా ఎక్కువగా పెంచుతానని చెప్పడం సహించరానిదని వారు ధ్వజమెత్తారు. ట్రంప్ టారిఫ్ లను




మోడీ వ్యతిరేకించాలని, భారత్ పై అమెరికా సుంకాలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు గడ్డం నాగరాజు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుంకన్న, బజారి, శివుడు, రాముడు, సుబ్బారాయుడు, సూరి, నాగేష్, రమేష్, రవి, మార్క్ లు,మణి,ఆటో యూనియన్ నాయకులు చిన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్న రాముడు, బాబురావు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెకిపోదాం కార్యక్రమంలో ఐసిడిఎస్పిడి విజయ కు కాలనీ మహిళలు విన్నవించారు





మన గళం : క్రిష్ణగిరి మండలం ఎరుకలచెరువు గ్రామంలో పల్లెకిపోదాం కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన అధికారులను మహిళలు నిలదీశారు. గ్రామంలోని ఆగవేలికి వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు పడి మోకాళ్ళ లోతు నీళ్లు ఆగి నెలలు గడుస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారని జిల్లా ఐసిడిఎస్పిడి విజయ కు కాలనీ మహిళలు విన్నవించారు. ఈ గుంటల్లో వాహనదారులు కింద పడి లేచే వెళ్తున్నారని, ఈ గుంటలో నీరు దుర్వాసన లేచి ఈ ఇళ్లలో ఉండే వర్షం లేకుండా పోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన పల్లే కి పోదాం కార్యక్రమం మొదటి రోజే మహిళల నుండి వ్యతిరేకత రావడంతో అధికారులు అవాక్కయ్యారు. మా సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను పట్టుపట్టారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పిడి నచ్చ చెప్పడంతో వారు శాంతించారు.

# కోడుమూరు ఏపీ మోడల్ స్కూల్ నందు పల్లెకు పోదాం కార్యక్రమం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో నేడు ఏపీ మోడల్ స్కూల్ నందు పల్లెకి పోదాం కార్యక్రమం జరిగిందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆశాజ్యోతి తెలియజేశారు ఈనాడు స్పెషల్ ఆఫీసర్, కోడుమూరు ఎన్.వెంకటరాముడు, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ, కర్నూలు, కోడుమూరు ఎంపీడీఓ ఏసీ రాముడు, మండల అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో, పాఠశాల వాష్‌రూమ్‌ని సందర్శించారు కొంతమంది విద్యార్థుల అకడమిక్ రికార్డులను తనిఖీ చేసి, వారి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారి గారికి విద్యార్థులు రోజు స్కూల్ కు రావడానికి రోడ్డు గుంటలు గుంటలుగా చాలా ఇబ్బందిగా ఉందని ఆ రోడ్డును వేయించాలని ప్రత్యేక అధికారికి విన్నవించుకున్నారు వారు అప్రోచ్ మెటల్ రోడ్డు కోసం ప్రాతినిధ్యం ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# సెల్ఫీ వీడియో చూపిస్తూ పోల్కల్ గ్రామంలో ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం





మన గళం సి బెలగల్: కర్నూలు జిల్లాలో కోడుమూరు నియోజవర్గం సి బెళగల్ మండలంలోని పోల్కల్ గ్రామంలో ఇద్దరు ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం చేశారు ఉల్లి పంటకు సరైన ధర రావడంలేదని తాము పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన చెంది సెల్ఫీ వీడియోలో పోల్కల్ చెందిన ఉల్లి రైతులు కృష్ణ వెంకటేష్ నాయుడు ఆత్మహత్యాయత్నం చేశారు కూటమి ప్రభుత్వము రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదని వీరు ఆవేదన చెందారు ఒక ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి వడ్డీకి తెచ్చి మాకు పెట్టుబడి కూడా రాకపోతే మేము ఏం చేయాలని రైతులు మనోవేదన చెంది ఆత్మహత్యాయత్నం చేశారు హుటా హుటిగా ఆ రైతులను కర్నూల్ సర్వజన వైద్యశాలకు తరలించారు సరైన సమయానికి వైద్యులు వారికి చికిత్స అందించి వారిని ప్రమాదం నుంచి రక్షించారు

# కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన వ్యక్తి దారుణ హత్య



మన గళం కోడుమూరు: కోడుమూరు మండలం కేంద్రంలో వెంకటగిరి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురి అయ్యాడు. మృతుని అన్న మధు తెలిపిన వివరాల మేరకు వెంకటగిరి గ్రామానికి చెందిన మద్దిలేటి, గిడ్డమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు మధు వెంకటగిరి గ్రామంలోని వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండవ కుమారుడు గిరి (28) జెసిబి డ్రైవర్గా కర్నూల్ లో పనిచేయుచున్నాడు. ఆదివారం మాల పౌర్ణమి కావడంతో కర్నూల్ నుంచి వెంకటగిరి కి వెళ్లాడు. అక్కడ నుంచి వారి స్నేహితులైన మౌలాలి, హుస్సేన్ తో పాటు కోడుమూరులో ఉన్నటువంటి రవీంద్ర వైన్స్ దగ్గరికి వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తూ మాట మాట పెరిగి మౌలాలి ఒకసారి గా కత్తితో గొంతు కోశారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# నంద్యాల జిల్లాకు చేరిన 5,200 మెట్రిక్ టన్నుల యూరియా



– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : జిల్లాకు 5200 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చేరుకున్న యూరియాలో రైతు సేవా కేంద్రాలకు 3,200 మెట్రిక్ టన్నులు చేరిందన్నారు. మిగిలిన రెండు వేల మెట్రిక్ టన్నులు రిటైలర్స్ కు సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులకు సరిపడా యూరియా రైతుసేవ కేంద్రాలలో అందుబాటులో ఉంది. సెప్టెంబర్ 9వ తేదీన 2600 మెట్రిక్ టన్నుల యూరియా, సెప్టెంబర్ 12న మరొక 1500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల ఇండెంట్ ప్రకారం, రైతుల అవసరాన్ని బట్టి పంటల సాగు ప్రకారం అవసరమైన రైతులకు యూరియాను అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందరాదన్నారు. జిల్లాలోని డీలర్లు వారి వద్ద నున్న యూరియాను ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని, ఎటువంటి కృత్రిమ కొరత సృష్టించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించండి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల : జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ప్రకృతి వ్యవసాయంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 50వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అందుకు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చు, ఆదాయం పెరుగుతుందన్న విషయం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీటి ద్వారా భూసారం పెరుగుతుందని, సహజ వనరులను సంరక్షించే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా పొలాల్లో వేసే పంట కంటే పొలం గట్ల మీద పంట ద్వారానే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి వారం జరిగే మహిళా సమాఖ్య సమావేశాల్లో కూడా ప్రకృతి వ్యవసాయం పెంపుదలపై చర్చించాలని సూచించారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రాల్లో కూడా కిచెన్ గార్డెన్స్ లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించాలన్నారు. జిల్లాకు క్లస్టర్ వారీగా ఒక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి (ఇంచార్జి) ఎంసీ.మద్దిలేటి, హార్టికల్చర్ అధికారి నాగరాజు, డీఆర్డిఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సిరికల్చర్ అధికారి నాగేష్, ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

- గత 2 రోజుల్లో జిల్లాకు 5,200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- రాబోయే వారంలో అందుబాటులోకి రానున్న మరో 4,100 మెట్రిక్ టన్నులు
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు – మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మనగళం, నంద్యాల : నంద్యాల జిల్లా రైతులు యూరియా సరఫరా విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భరోసా ఇచ్చారు. రైతులకు యూరియా సరఫరా అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. యూరియా సరఫరా విషయంలో క్షేత్రస్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో తాజాగా 5.200 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లా వ్యాప్తంగా అన్ని మండల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు అసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అదే సమయంలో రాబోయే వారం రోజుల్లో మరో 4,100 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రాబోతుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారంతో రైతుల్లో క్షేత్రస్థాయిలో తీవ్ర ఆందోళన నెలకొందని, వ్యవసాయ శాఖ అధికారులు మరింత సమర్థవంతంగా యూరియా సరఫరా చేపట్టాలని సూచించారు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో యూరియాకు సంబంధించి బ్లాక్ మార్కెట్ కు ఆస్కారం లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రైతులు సైతం అవసరమైన మేరకే యూరియాను కొనుగోలు చేయాలని, అవసరానికి మించి కొనుగోలు చేస్తే, అది అంతిమంగా కృత్రిమ కొరతకు దారితీయడంతో, మిగిలిన రైతులు ఇబ్బంది పడే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు.

# ప్రభావం చూపని జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు


మనగళం, వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల తగ్గింపు మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపలేకపోతోంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలు, అమెరికా టారిఫ్‌ల భయాలు ఇప్పటికీ ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. జిఎస్‌టి శ్లాబులను 5, 12 శాతాలకు తగ్గించడం ద్వారా మార్కెట్లు పరుగులు పెడతాయని ప్రభుత్వ వర్గాలు ఊహించినప్పటికీ.. ఆచరణలో భిన్నంగా ట్రేడింగ్ అవుతోన్నాయి. గురువారం, శుక్రవారం సెషన్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పడిపోతూ చరిత్రలోనే ఎప్పుడూ లేని కనిష్ట స్థాయి 88.27కు దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు మిశ్రమంగా నమోదయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 7.25 శాతం తగ్గి 80,710.76 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 24,641 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ సెన్సెక్స్ 150 పాయింట్ల ర్యాలీతో సరిపెట్టుకుంది. వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండిస్ట్రీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 0.20 శాతం, స్మాల్ క్యాప్ 0.19 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగం 1.125 శాతం, లోహ రంగం 0.68 శాతం, మీడియా 0.59 శాతం చొప్పున పెరగ్గా.. ఐటి రంగం ఏకంగా 1.44 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఎఫ్‌ఎంసిజి 1.42 శాతం, రియాల్టీ 1.16 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

# టాటా కార్లపై రూ. 1.55 లక్షల వరకు తగ్గింపు




మనగళం,తాజాగా ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ 2.0 రేట్ల తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తూ ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ శుక్రవారం తన వాహనాలపై భారీ తగ్గింపు వివరాలను ప్రకటించింది. ప్యాసింజర్ వాహనాల ధరలను రూ. 75,000 నుంచి రూ. 1.55 లక్షల వరకు తగ్గించినట్టు తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. కంపెనీ అధికారిక వివరాల ప్రకారం, టాటా చిన్న కార్లలో టియాగో మోడల్‌పై రూ. 75 వేలు, టిగోర్‌పై రూ. 80 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ. 1.10 లక్షలు తగ్గించింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పంచ్ కారుపై రూ. 85 వేలు, నెక్సాన్‌పై రూ. 1.55 లక్షలు తగ్గించింది. మిడ్-సైజ్ ఎస్‌యూవీలలో కర్వ్‌పై రూ. 65 వేలు, ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో హారియర్‌పై రూ. 1.40 లక్షలు, సఫారీపై రూ. 1.45 లక్షలు తగ్గించింది. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని టాటా మోటార్స్ ప్యాసింజర్ విభాగం ఎండీ శైలేష్ చంద్ర వెల్లడించారు.


# యూనిట్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలి




మనగళం, నంద్యాల : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, యూనిట్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ సూచించారు. నంద్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం లో శనివారం జిల్లా మలేరియా అధికారి పి.చంద్రశేఖర రావు, అసిస్టెంట్ మలేరియా అధికారి కె . సత్యనారాయణతో కలిసి ఆయన నంద్యాల జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో " జిల్లాలో నమోదవుతున్న జ్వరాల నివారణ చర్యలపై సమీక్షా సమావేశం " నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల వలన గ్రామాలలో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది మలేరియా , డెంగ్యూ , మెదడు వాపు , ఫైలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి దోమల లార్వాలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వాలు ఆపరేషన్ చేయించాలన్నారు. అదేవిధంగా ఇళ్లలో పైరిత్రం స్ప్రేయింగ్, ఫాగింగ్ తదితర దోమల నివారణ చర్యలు కచ్చితంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజు ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి చుట్టుపక్కల దోమల లార్వాలు గుర్తించి వాటిని నిర్మూలించాలని , జ్వరాల తీవ్రత గురించి జిల్లా కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వసతిగృహాలు, కేజీబీవీ హాస్టలను సందర్శించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏడు సబ్ యూనిట్ పరిధిలోని మలేరియా సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్..?

మనగళం : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొన్నేళ్లలో మరో ఘనత సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా అనుకున్న లక్ష్యాలకు చేరుకుంటే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద సంస్థ సీఈవోగా ఆయనకు భారీ మొత్తం సమకూరనుంది. దీంతో ఆయన సంపద భారీగా పెరగనుంది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలాన్ మస్క్ ఇప్పటికే తొలి స్థానంలో ఉన్నారు. ఎలోన్ మస్క్ కు టెస్లా భారీ ఆఫర్ ఇచ్చింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, అమెరికన్ కంపెనీ టెస్లా తదుపరి జజూా గా కొనసాగడానికి, కంపెనీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి ఎలోన్ మస్క్ కు ఇచ్చిన జీతం ఆఫర్ విలువ 1 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.83,00,000 కోట్లు) అని చెబుతారు. ఇప్పటివరకు చరిత్రలో ఇదే అతిపెద్ద జజూా జీతం ప్యాకేజీ అవుతుందట. ఈ ఆఫర్ 10 సంవత్సరాలకు అందించింది. కానీ ఈ భారీ మొత్తాన్ని మస్క్‌కు ఒకేసారి ఇవ్వరు. దీని కోసం అతను టెస్లా అనేక రంగాలలో గొప్ప విజయాన్ని సాధించేలా చేయాలి. ముఖ్యంగా కంపెనీ కొత్త "రోబోటాక్సీ" వ్యాపారాన్ని వేగంగా విస్తరించాలి. కంపెనీ మార్కెట్ విలువను నేటి దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల నుండి కనీసం 8.5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలి. ఈ ప్రణాళిక ప్రకారం, మస్క్ అన్ని లక్ష్యాలను సాధిస్తే అతను మిలియన్ల కొద్దీ టెస్లా షేర్లను పొందుతాడు. దీని వలన కంపెనీలో అతని వాటా 25% కి పెరుగుతుంది. భవిష్యత్తులో కంపెనీ దిశపై బలమైన నియంత్రణను కొనసాగించగలగడానికి టెస్లాలో తనకు అలాంటి వాటా కావాలని ఎలోన్ మస్క్ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించాడు. ఈ జీతం ఆఫర్‌ను అతని 2018 ప్యాకేజీతో పోల్చి చూస్తే అది దాదాపు విచ50 బిలియన్లు (సుమారు 4 లక్షల కోట్లు). దీనిని ఇటీవల కోర్టు తిరస్కరించింది. కానీ టెస్లా బోర్డు ఇప్పుడు మస్క్‌ను కొత్త, మరింత ప్రభావవంతమైన మార్గాల్లో కంపెనీకి అనుబంధంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ప్రతిపాదనలో మస్క్ కంపెనీ భవిష్యత్ జజూా ని ప్లాన్ చేయడంలో చురుకైన పాత్ర పోషించాల్సిన షరతు కూడా ఉంది. ఈ ప్యాకేజీలో చివరి భాగాన్ని పొందడానికి అంటే మస్క్ డబ్బు సంపాదించడానికి మాత్రమే కాకుండా కంపెనీ తదుపరి తరాన్ని సిద్ధం చేయడానికి కూడా దోహదపడాలి.



# మిరాయ్ మేజిక్ జరగాల్సిందే

మన గళం, సినిమా : కొత్త శుక్రవారం వచ్చేసింది. వేర్వేరు అంచనాలు, ప్రమోషన్లతో వచ్చిన మూడు సినిమాల జాతకం తేలిపోయింది. కమర్షియల్ గా ఎవరి స్థాయి ఏంటనేది సోమవారానికి క్లారిటీ వస్తుంది కానీ హిట్టు స్టేటస్ పక్కనపెడితే వీటిలో ఏదీ ఓ ముప్పై కోట్ల షేర్ వసూలు చేయడం జరగని పనిలా కనిపిస్తోంది. సరే వీటి జాతకం ఎలా ఉన్నా సరిగ్గా వారం రోజుల తర్వాత రాబోతున్న మిరాయ్ మీద థియేటర్ వ్యవస్థ బోలెడు ఆశలు పెట్టుకుంది. తేజ సజ్జ హీరో కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు చిన్న పిల్లల్లో సైతం ఇది ఆసక్తి రేపుతోంది. చాలా రీజనబుల్ బిజినెస్ జరుపుకున్న మిరాయ్ హిట్టయితే బయ్యర్లకు భారీ లాభాలొస్తాయి. అదే రోజు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కిష్కిందపురి ఉంది కానీ హారర్ ఎలిమెంట్స్ వల్ల సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. సో మిరాయ్ కు అది కూడా అడ్వాంటేజ్ కానుంది. సెప్టెంబర్ 25 ఓజి వచ్చేదాకా మిరాయ్ కు పదమూడు రోజులు ఓపెన్ గ్రౌండ్ దొరుకుతుంది. హనుమాన్ స్థాయి బ్లాక్ బస్టర్ దక్కుతుందని తేజ సజ్జ బలంగా నమ్ముతున్నాడు. పైగా ఇతర భాషల్లో బడా సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తుండటంతో ఇండియా వైడ్ పెద్ద రిలీజ్ అందుకుంటోంది. బొమ్మ క్లిక్ అయితే మాత్రం తేజ సజ్జ రేంజ్ పెరగడంతో పాటు విలన్ గా మంచు మనోజ్ ఇతర బాషల డైరెక్టర్ల దృష్టిలో పడతాడు. టాలీవుడ్ కున్న ప్రధాన సమస్య గత రెండు మూడు నెలలుగా వారాల తరబడి హౌస్ ఫుల్స్ చేయిస్తున్న సినిమా ఒక్కటి రాలేదు. ఏదైనా సరే వీకెండ్ హడావిడికి పరిమితమై తర్వాత నెమ్మదిస్తున్నాయి. కానీ మిరాయ్ అలా కాకూడదు. సరైన మూవీ లేదనే కారణంతోనే జనాలు థియేటర్ల వైపు పెద్దగా చూడటం లేదు. ఇప్పుడొకటి వస్తోందంటే ఖచ్చితంగా జనాలు కదులుతారు. కాకపోతే ఆ స్థాయి టాక్ ని మిరాయ్ తెచ్చుకోవాలి. మహావీర్ నరసింహ తప్ప ఈ మధ్య కాలంలో పబ్లిక్ కళకళలాడుతూ థియేటర్లలో కనిపించిన దాఖలాలు లేవు. మరి మిరాయ్ కనక ఆ లోటు తీరిస్తే మంచిదే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఈ హిట్టు చాలా ముఖ్యం.

# యూనిక్ యాక్షన్ థ్రిల్లర్



మన గళం, సినిమా : జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రిష సమర్పకురాలిగా సురక్ష్ బ్యానర్‌పై మల్కాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రీతీ జంఘియానీ రీఎంట్రీ ఇస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో జె.డి చక్రవర్తి మాట్లాడుతూ "నిర్మాత శివకుమార్ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ని ముంబైలో ఎక్కడ రాజీపడకుండా చేస్తున్నారు. సీరత్ మంచి డాన్సర్, కొరియోగ్రాఫర్, సింగర్. ఈ సినిమాలో తన నటన అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ శ్రవణ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు"అని అన్నారు. డైరెక్టర్ శ్రవణ్ మాట్లాడుతూ "సినిమాలో ఇన్వెస్టిగేషన్ పార్ట్ అద్భుతంగా ఉంటుంది. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్, నిర్మాత శివకుమార్ చాలా సపోర్ట్ చేశారు"అని తెలిపారు. నిర్మాత మల్కాపురం శివ కుమార్ మాట్లాడుతూ "కొత్త డైరెక్టర్ శ్రవణ్ చెప్పిన కాన్సెప్ట్ అద్భుతంగా అనిపించింది. జెడి చక్రవర్తి, నరేష్, శరత్ కపూర్ మా బ్యానర్‌లో వర్క్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది పాన్ ఇండియా మూవీ"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరో నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించబోతున్నాం

మన గళం, సినిమా : నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'అఖండ-2'. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంయుక్తా మీనన్, హర్షల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ మూవీని బాలయ్య చిన్న కూతురు 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను తమన్ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది. కానీ కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం చిత్రబృందం వెల్లడించకపోవడంతో అసలు ఈ మూవీ ఇప్పట్లో వస్తుందా? లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక అఖండ-2ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, నందమూరి బాలయ్య ఓ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు వెల్లడించారు. "అఖండ-2 సినిమా డిసెంబర్‌లో విడుదల కాబోతుంది. తమన్ సంగీతంపై మరింత సమయం కావాలని అన్నాడు. అఖండ విడుదల సమయంలో సౌండ్ వూఫర్లు బద్దలయ్యాయి. కానీ అఖండ-2 డిసెంబర్‌లో దానికంటే 50 రేట్లు పెద్దగా ఉంటుంది. త్వరలో కచ్చితమైన రిలీజ్ తేదీని ప్రకటిస్తాము. అభిమానుల అంచనాలను మించి ఉంటుంది. బాక్సాఫీసులో చరిత్ర సృష్టించబోతున్నాము"అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు సంతోష పడుతుంటే.. మరికొందరు మాత్రం కాపీ చేసే సంగీతానికి ఇంకెన్ని రోజులు సమయం తీసుకుంటావని తమన్‌ను తిట్టిపోస్తున్నారు.

# యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు సబలెంక, అనిసిమోవా



మన గళం,: నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్ న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, టాప్ సీడ్ అర్యానా సబలెంక (బెలా రస్), అమందా అనిసిమోవా (అమెరికా) ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడుసెట్ల హొరాహొరీ పోరులో వీరిద్దరూ ప్రత్యర్థులను చిత్తుచేశారు. తొలి సెమీస్‌లో అమెరికాకు చెందిన 8వ సీడ్ అనిసిమోవా 7-6(7-4), 6-7(3-7), 6-3తో 23వ సీడ్, జపాన్‌కు చెందిన నవోమి ఒసాకాను ఓడించింది. రెండో సెమీస్‌లో సబలెంక 4-6, 6-3, 6-4తో 4వ సీడ్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాను చిత్తుచేసింది. శనివారం జరిగే టైటిల్ పోరులో సబలెంక అమెరికాకు చెందిన అనిసిమోవాతో తలపడనుంది. 27ఏళ్ల సబలెంక 2024లో ఈ టైటిల్‌ను తొలిసారి కైవసం చేసుకుంది. వీరిద్దరూ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడడం ఇదే తొలిసారి. టాప్‌సీడ్ సబలెంక ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కాగా.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌లో ఓటమిపాలైంది. 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను చేజిక్కించుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ పోరాటానికి సెమీస్‌లో బ్రేక్ పడింది. 14వ సీడ్‌గా బరిలోకి గిన బాంబ్రీ(భారత్)-ఎం. వీనస్(ఆస్ట్రేలియా) జంట శుక్రవారం జరిగి సెమీస్‌లో 7-6(7-2), 6-7(5-7), 4-6తో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 7వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌తో 2వ సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ తలపడనున్నాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెనిక్ సిన్నర్‌తో 25వ సీడ్, అగర్ అలియాస్సిమ్(కెనడా) పోటీపడనున్నాడు.

# జగదీశన్ డబుల్ సెంచరీ మిస్



మన గళం,: దులీప్ ట్రోఫీ-2025 సెమీఫైనల్లో సౌత్‌జోన్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ తృటిలో డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. నార్త్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో రెండోరోజు జగదీశన్(197) రనౌటయ్యాడు. రికీబుయ్(54), త్యాగరాజన్(58) అర్ధసెంచరీలతో రాణించడంతో సౌత్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 536పరుగుల భారీస్కోర్ చేసింది. సౌత్ జోన్ ఓపెనర్, తమిళనాడు స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ నారయణ్ జగదీశన్ డబుల్ సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఔటయ్యాడు. 148 పరుగులతో రెండో రోజు బ్యాటింగ్‌ను కొనసాగించిన జగదీశన్.. సునాయసంగా డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకునేలా కన్పించాడు. కానీ 197 పరుగుల వ్యక్తిగత స్కోర్ నార్త్ జోన్ ఆటగాడు నిశాంత్ సింధు అద్భుత త్రోకు బలయ్యాడు. జగదీశన్ ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. నార్త్‌జోన్ బౌలర్లు నిషాంత్ సింధుకు ఐదు, కంబోజ్‌కు రెండు, దగర్, లోత్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో సెంట్రల్ జోన్ జట్టు బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. మలేవార్(76), శుభమ్ శర్మ(60నాటౌట్)కి తోడు కెప్టెన్ రజత్ పటీధర్(47నాటౌట్) బ్యాటింగ్‌లో మెరిసారు. దీంతో ఆ జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి 2 వికెట్ల నష్టానికి 229పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 363పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన వెస్ట్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 438పరుగులకు ఆలౌటైంది. గైక్వాడ్(184) సెంచరీకి తోడు తనుష్ కోటియన్(76), శార్దూల్ ఠాకూర్(64) అర్ధసెంచరీలతో రాణించారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు నరాన్ష్ జైన్, హర్ష్ దూబేకు మూడేసి, ఖలీల్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. వెస్ట్‌జోన్ జట్టు ఇంకా 209పరుగులు వెనుకబడి ఉంది.

# భారత్ శుభారంభం



మన గళం,: థాయ్ లాండ్‌పై 11-0తో గెలుపు - ఆసియాకప్ మహిళల హాకీ హాంగ్జు(చైనా): ఆసియాకప్ మహిళల హాకీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పూల్-బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 11-0తో థాయ్ లాండ్‌ను చిత్తుచేసింది. ఉదిత దుహాన్, బ్యూటీ డంగ్ డంగ్ రెండేసి గోల్స్‌తో సత్తా చాటారు. ఉదిత 30, 52వ ని.లో గోల్స్ చేయగా.. బ్యూటీ 45, 54వ ని.లో గోల్స్ చేశారు. ముంతాజ్(7వ ని.), సంగీత(10వ ని.), నవ్‌నీత్ కౌర్(16వ ని.), లాల్‌రిమిసిమి(18వ ని.), సుమన్ దేవి(49వ ని.), షర్మిల(57వ ని.), రుతుజ ధండోస్(60వ ని.) ఒక్కో గోల్స్ కొట్టారు. ఎఫ్ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 9వ స్థానంలో, థారులాండ్ 30వ స్థానాల్లో ఉన్నాయి. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత్ 5-0 ఆధిక్యతలో నిలిచింది. మొత్తం 8జట్ల మధ్య జరిగే ఈ టోర్నీలో ప్రతి గ్రూప్‌లో టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-4లో ఆడనున్నాయి. అనంతరం టాప్-2 ఉన్న జట్ల మధ్య సెప్టెంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వెటరన్ గోల్ కీపర్ సవిత పూనియా, డ్రగ్ ఫ్లికర్ దీపిక లేకుండానే ఈ టోర్నీ బరిలో భారత్ ప్రాతినిధ్యం వహిస్తోంది. టోర్నీ విజేతగా నిలిచిన జట్టు నెదర్లాండ్స్-బెల్జియం వేదికగా జరిగే 2026 మహిళల ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. శనివారం రెండో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్, 8న సింగపూర్‌తో తలపడనుంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310